బ్యాంకు నిర్లక్ష్యం..

రైతులకు శాపం

సీడెడ్ సొసైటీల సభ్యులకు

రుణాలను రెన్యూవల్ చేయని ఎస్‌బీఐ

రుణమాఫీకి నోచుకోని సొసైటీ రైతులు

7లో



సింగూరుకు స్వల్ప వరద

రెండు నెలల్లో చేరింది ఒక టీఎంసీయే..

పుల్‌కల్, జూలై 29: సింగూరు ప్రాజెక్టుకు నిలకడగా, స్వల్పంగా వరద వస్తోంది. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1,779 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు ఒక టీఎంసీ మేర జలాలు చేరినట్లు అధికారులు ప్రకటించారు. ప్రాజెక్టుకు ఎగువన మంజీర నది తీర ప్రాంతంలోని మునిపల్లి, ఝరాసంఘం, రాయికోడ్, న్యాల్‌కల్, వట్‌పల్లి, మనూరు, నాగలగిద్ద మండలాల్లో కురిసిన ఓ మోస్తారు వర్షానికి ఈ నీరు వచ్చి చేరింది. నిండు వర్షాకాలం సీజన్ కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎగువన వర్షాలు అంతగా కురియలేదు. అడపాదడపా కురిసిన వర్షాలకు ఈ మాత్రం జలాలు వచ్చి చేరాయని ప్రాజెక్టు జేఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.533 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఇక తాలవెల్మ ఎత్తిపోతలకు 41 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యుఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కుల చొప్పున సరఫరా అవుతున్నాయి. 200 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతుండగా మొత్తంగా 391 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా నమోదయింది.



నిఖిల్ (ఫైల్)

డెంగీతో ఇంటర్ విద్యార్థి మృతి

చిన్నశంకరంపేట, జూలై 29: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి డెంగీతో బాధపడుతూ సోమవారం వేకువ జామున మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేశం, సరస్వతి దంపతుల పెద్ద కుమారుడు నిఖిల్(17) హైదరాబాద్‌లోని ఓ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు ఆస్పత్రితో చేర్పించగా, డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

71 వేల మందికి రూ.728 కోట్లు



నేడే రెండో విడత రుణమాఫీ

- రూ. లక్షన్నర వరకు రైతుల ఖాతాల్లో జమ
- మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం
- తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల మందికి లబ్ధి
- సొసైటీ రుణాలపై చిక్కుముడి



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 29: రెండో విడత రుణమాఫీని నేడు అమలు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. ఆ దిశగా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు వచ్చాయి. నేటి మధ్యాహ్నం 12గంటల నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. తొలి విడతగా రూ.లక్ష వరకు రుణాలు పొందిన రైతులకు మాఫీ జరిగింది. ప్రస్తుతం రూ.లక్షన్నర రుణాలను రెండో విడతగా మాఫీ చేయనున్నారు. ఇక చివరగా మూడో విడతలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. ఆగస్టు 15వ తేదీ లోపు తుది విడత పూర్తిచేస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. తొలి విడత రుణమాఫీని ఈ నెల 18వ తేదీన అమలు చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,70,205 మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. వీరిలో ఎక్కువగా మూడెకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు, రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు రుణం తీసుకున్నవారు ఉన్నారు.

తొలి విడతలో రూ.902 కోట్లు

తొలి విడతగా ఉమ్మడి జిల్లాలోని రైతులకు రూ.902 కోట్ల రుణమాఫీ జరిగింది. 1,60,636 రైతు కుటుంబాలకు లబ్ధి జరిగింది. రాష్ట్రంలోనే అత్యధిక రుణమాఫీ జరిగిన తొలి రెండు నియోజకవర్గాలుగా సంగారెడ్డి జిల్లాలో అందోలు, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నిలిచాయి. దుబ్బాక నాలుగో స్థానంలో నిలిచింది. నారాయణఖేడ్, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల రైతులకూ రూ.90 కోట్ల చొప్పున నిధులు సమకూరాయి.

నేడు 71వేల మందికి..

నేడు మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండో విడతగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని అధికారికంగా పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలు సైతం బహిర్గతం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 71వేల పైచిలుకు రైతులకు ప్రయోజనం కలగనున్నది. ఈ రైతుల్లో 5 ఎకరాల లోబడి ఉన్నవారే అధికం. కాగా తొలి విడతలో ఉన్నట్లుగానే ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులను రుణమాఫీ నుంచి మినహాయిస్తున్నట్లు తెలిసింది. వీరు పొందిన రుణాలతో ప్రభుత్వానికి సంబంధం లేదని తేల్చిచెప్పింది. అందుకే రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్య కూడా భారీగానే తగ్గుతోంది.

రెండో విడత రుణమాఫీ వివరాలు

జిల్లా	రైతులు	రుణమాఫీ(కోట్లలో)
సంగారెడ్డి	25,192	రూ.268.25
సిద్దిపేట	27,875	రూ.277.21
మెదక్	18,540	రూ.183.26

'సొసైటీ' రైతులకు మాఫీ జరిగేనా?

ప్రాథమిక సహకార సంఘాల్లో సభ్యులైన రైతులు కొంత మంది ఎస్‌బీహెచ్ బ్రాంచ్‌లో రుణాలు పొందారు. సొసైటీల్లోనే వీరి డాక్యుమెంట్లను పరిశీలించి రుణాలు సొసైటీ నుంచి కాకుండా ఎస్‌బీహెచ్ నుంచి ఇచ్చారు. ఎస్‌బీహెచ్ బ్యాంకు తర్వాతి రోజుల్లో ఎస్‌బీఐలో విలీనమైంది. దీంతో తమకు అన్యాయం జరిగిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం పీఏసీఎస్ సొసైటీ పరిధిలో 1,369 మంది రైతులకు రూ.4.25 కోట్ల రుణం మాఫీ కావాల్సి ఉన్నా కాలేదు. ఇదేవిధంగా సంగారెడ్డి జిల్లాలోని మల్కాపూర్, కొండాపూర్, నందికంది, నాగాపూర్ తదితర 16 సొసైటీల్లో ఈ పరిస్థితి ఉన్నట్లుగా తెలుస్తోంది. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సొసైటీ ఖాతాదారులకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయి. తొలివిడతలో మాఫీ జరగకపోవడంతో కనీసం రెండో విడతలోనైనా తమకు లబ్ధి చేకూరుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ ఆస్తులకు హైడ్రా రక్షణ

- చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు ధార్మిక సంస్థల ఆస్తుల రక్షణే ధ్యేయం
- చైర్మన్‌గా వ్యవహరించనున్న సీఎం.. కమిషనర్‌గా ఐజీ స్థాయి అధికారి
- పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం పరిధిలో చెరువుల రక్షణ జరిగేనా?

పటాన్‌చెరు, జూలై 29: విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్‌లో విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నది. హెచ్ఎండీఏ పరిధిలో పెద్దఎత్తున చెరువులు, కుంటలు, గొలుసు కట్టు చెరువులు పెద్దఎత్తున ఆక్రమణకు గురవడంతో ఏటా భారీ వర్షాలకు అనేక జనావాసాలు నీటమునుగుతున్నాయి. విపత్తు నిర్వహణ సైతం పెద్ద ప్రహసనంగా మారుతోంది. పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం మండలాల పరిధిలో పెద్దఎత్తున చెరువులు, కుంటలు, కాలువలు కబ్జాకు గురయ్యాయి. ప్రస్తుతం ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని గ్రామాలు, జీహెచ్ఎంసీ డివిజన్లు, మున్సిపాలిటీలను 'హైడ్రా' పరిధిలోకి తీసుకురావడంతో పరిస్థితి మెరుగుపడుతుందని భావిస్తున్నారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ జీహెచ్ఎంసీ డివిజన్లతో పాటు తెల్లాపూర్, బొల్లారం, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, ఇంద్రేశం, చిన్నకంజర్ల, పెద్దకంజర్ల, ఐనోల్, ముత్తంగి, ఇస్నాపూర్, పాషమైలారం, లక్డారం, పోచారం, చిట్కుల్, రుద్రారం, పాటి, ఘనాపూర్, కర్ధనూర్, ఐలాపూర్, ఐలాపూర్‌తండా, సుల్తాన్‌పూర్, దాయర, గండిగూడ, జానకంపేట, వడక్‌పల్లి, బొమ్మన్‌కుంట గ్రామాలను హైడ్రా పరిధిలోకి తెచ్చారు.

ల్యాండ్ మాఫియాపై ఉక్కుపాదం

ప్రభుత్వ అసైన్డ్ భూముల పరిరక్షణ ఇకపై 'హైడ్రా' పరిధిలోకి వెళ్లనుంది. దేవాదాయ, వక్ఫ్, ఇనాం భూములను కాపాడే బాధ్యత కూడా దానికే అప్పగించారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని 993, 630 సర్వే నంబర్లలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్, పెద్దకంజర్ల తదితర గ్రామాల్లో పెద్దఎత్తున అసైన్డ్ భూములను ల్యాండ్ మాఫియా అమ్మేస్తున్నది. చెరువులు, కుంటల పరిస్థితి మరీ దారుణంగా మారింది. అమీన్‌పూర్ జీవవైవిధ్య పెద్దచెరువు విస్తీర్ణం రోజురోజుకూ కుచించుకుపోతున్నది. పంట కాల్వలు కబ్జాలకు గురవుతున్నాయి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పెద్దఎత్తున మట్టిని నింపుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జిన్నారం మండలం బొల్లారం పట్టణంలో చెరువులు, కుంటలు మాయమై బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో వనం చెరువు కబ్జా చేసి భవనాలను నిర్మించారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ శాఖలు చేష్టలుడిగి చూస్తున్నాయి. శాఖల మధ్య సమన్వయ లోపం అక్రమార్కుల పాలిట వరంగా మారింది. ఈ నేపథ్యంలో హైడ్రా రక్షణగా నిలవనుందని భావిస్తున్నారు.

కీలక శాఖల సమన్వయం..

శాఖల మధ్య సమన్వయం, ఉన్నతాధికారుల పర్యవేక్షణతో హైడ్రా కార్యకలాపాలు సాగనున్నాయి. ఒకే గొడుకు కిందకు కీలకమైన శాఖలను తేవడం ద్వారా సమన్వయంతో మెరుగైన ఫలితాలు సాధిస్తారని భావిస్తున్నారు. హైడ్రా పాలకమండలికి చైర్మన్‌గా సీఎం వ్యవహరించడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. కమిషనర్‌గా ఐజీ స్థాయి పోలీసు అధికారి, కమిటీ సభ్యులుగా మున్సిపల్‌శాఖ మంత్రి, రెవెన్యూ, విపత్తు మంత్రి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, హైదరాబాద్ మేయర్‌తో వివిధశాఖలకు చెందిన 14 మంది ఉన్నతాధికారులు సభ్యులుగా కొనసాగనున్నారు. హైడ్రాకు బడ్జెట్‌లో ఏకంగా రూ. 200 కోట్లు కేటాయించడం గమనార్హం. ప్రత్యేక పోలీస్‌స్టేషన్, సిబ్బంది, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమిస్తున్నారు. ఉన్నత స్థాయి శాటిలైట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆక్రమణలను క్షేత్రస్థాయిలో గుర్తించి కూల్చివేయనున్నారు. ఇప్పటికే పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాలు గుర్తించి నివేదికను సమర్పించాలని నీటిపారుదల, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.



ఆక్రమణలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అమీన్‌పూర్ జీవవైవిధ్య పెద్ద చెరువు

ముగిసిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జూలై 29: ఉపాధ్యాయుల పదోన్నతుల రెండవ విడత ప్రక్రియ ముగిసింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం జూన్‌లో మొదటి విడత బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేసిన విషయం తెలిసిందే. అప్పట్లో కొందరు ఉపాధ్యాయులు విడివిడిగా రెండు, మూడు సబ్జెక్టుల్లో ప్రమోషన్లు పొందారు. కానీ, ఒకే సబ్జెక్టులో జాయిన్ అయ్యేందుకు అవకాశం ఉండడంతో మిగిలిన రెండు సబ్జెక్టుల్లో పోస్టులు ఖాళీగానే మిగిలిపోయాయి. ఈ ఖాళీలను కూడా భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు సర్కార్‌కు విన్నవించాయి. దీంతో, నాట్ విల్లింగ్ పేరిట మిగిలిన పోస్టులను భర్తీ చేసేందుకు రెండో విడత ప్రమోషన్లు చేపట్టారు. ఈమేరకు ఎంపిక చేసినవారికి విద్యాశాఖ సోమవారం ఉదయం పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేసింది. పదోన్నతి పొందిన వారంతా వెంటనే ఆయా బడుల్లో విధుల్లో చేరాలని ఆదేశించింది.

మెదక్ జిల్లాలో ఖాళీలు 67.. భర్తీ 60 మాత్రమే..

మొదటి విడత పదోన్నతుల ప్రక్రియ తర్వాత మెదక్ జిల్లాలో 67 పోస్టులు మిగిలిపోయాయి. ఇలా మిగిలిన పోస్టుల్లో అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చేందుకు సీనియారిటీ జాబితాను ప్రకటించారు. కానీ 60 మందికి మాత్రమే పదోన్నతులు కల్పించడంతో 7 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి.

సంగారెడ్డి జిల్లాలో 69 మంది టీచర్లకు పదోన్నతులు

సంగారెడ్డి జిల్లాలో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, పీఎస్‌హెచ్ఎం ఖాళీలను పదోన్నతుల్లో భాగంగా 69 మంది టీచర్లకు స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ యాజమాన్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్-1, బయోలజీ-1, ఫిజిక్-1, లోకల్ బాడీ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు-2, బయోసైన్స్-5, ఇంగ్లిష్-7, మ్యాథ్స్-2, ఫిజిక్స్-8, సోషల్-21, స్పెషల్ ఎడ్యుకేషన్-2, ఉర్దూ-2, పీఎస్‌హెచ్ఎంలుగా 18 మందికి పదోన్నతి లభించింది.

ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం

- ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ట్రక్కు
- ఇద్దరు మృతి, ఐదుగురికి తీవ్రగాయాలు
- సంగారెడ్డి జిల్లా హుసెల్లి వద్ద ప్రమాదం



సిరాజోద్దీన్ (ఫైల్)



సిరాజోద్దీన్ (ఫైల్)

న్యాల్‌కల్, జూలై 29: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లి వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం బీదర్‌కు చెందిన ముఖీం హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కారులో బీదర్ వస్తున్నాడు. న్యాల్‌కల్ మండలం హుసెల్లీ వద్దకురాగానే ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం డ్రైవర్ అతివేగంగా వస్తూ వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టాడు. ప్రమాద సమయంలో ఎనిమిది మంది ప్రయాణిస్తుండగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం బీదర్‌కు తరలిస్తుండగా తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్ సిరాజుద్దీన్, షాహీరాబేగం మార్గమధ్యలోనే మృతిచెందారు. మిగిలినవారు చికిత్సపొందుతున్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ముఖీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



హుసెల్లీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రక్కు ఢీకొనడంతో నుజ్జైన కారు


'గృహజ్యోతి'కి ఎడిట్ తంటు

- తెరుచుకోని ఆప్షన్
- మెదక్ జిల్లాలో 53,974 మంది ఎదురుచూపులు

మెదక్, జూలై 29: రాష్ట్ర సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకం కొందరు అర్హులకు వర్తించడం లేదు. ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందుపర్చే క్రమంలో జరిగిన పొరపాట్లతో పలువురు పథకానికి అర్హత సాధించలేకపోయారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచిత కరెంటు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇందుకోసం విద్యుత్ వినియోగదారుల వివరాలను సేకరించారు. ఈ పథకానికి ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో గతంలో దరఖాస్తులు స్వీకరించారు. పథకానికి కావాల్సిన ధృవపత్రాలను జతపర్చారు. వీటన్నింటినీ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. అయితే వివిధ కారణాలతో కొందరు పథకానికి ఎంపిక కాలేదు. చాలామందికి జీరో బిల్లు వర్తిస్తున్నా సిబ్బంది ఎంట్రీలో చేసిన తప్పిదాల కారణంగా అర్హత కోల్పోయారు. అయితే, మరికొందరు అసలు దరఖాస్తు చేసుకోలేని వారూ ఉన్నారు. ప్రస్తుతం గృహజ్యోతి మొదటి విడతలో దరఖాస్తులు చేసుకోలేని విద్యుత్ వినియోగ దారుల కోసం రాష్ట్ర సర్కార్ మరోమారు అవకాశం కల్పించింది.

మెదక్ జిల్లాలో 53,974 మంది అర్హులు

మెదక్ జిల్లావ్యాప్తంగా 1,73,934 విద్యుత్ వినియోగదారులు ఉండగా ఇందులో 1,19,960 మంది అర్హులు అయ్యారు. మిగతా 53,974 మంది అర్హత సాధించలేదు. వీరంతా ఉచిత కొన్ని సమస్యల కారణంగా 200యూనిట్ల ఉచిత విద్యుత్తును పొందలేకపోతున్నారు. ఈ పథకానికి ఎంపిక చేసేందుకు . అప్పట్లో పథకానికి అర్హత సాధించని వారు మరో మారు దరఖాస్తులు చేసుకోవడానికి చాన్స్ ఇచ్చింది. ఇందుకోసం మున్సిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. కానీ ఆ వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్ ఓపన్ కాక పోవడంతో లబ్ధిదారులకు సంబంధించి సవరణలు జరగడం లేదు.దీంతో తమకు అర్హత ఉన్నా ఉచిత విద్యుత్ పథకం లో చేర్చలేకపోతున్నారని వాపోతున్నారు. కొత్తగా మీటర్లు తీసుకున్న పేదలకూ ఈ స్కీమ్ అందడం లేదని వాపోతున్నారు. ఎడిట్ ఆప్షన్ తెరుచుకునే వరకూ తామేమీ చేయలేమని సిబ్బంది చెబుతున్నారు.



మెదక్ మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్‌లో పనిచేయని ఎడిట్‌ఆప్షన్



ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో 'విజిలెన్స్' గుబులు

- బదిలీల నుంచి మినహాయింపునకు ఆఫీస్ బేరర్ల లెటర్లు?
- విజిలెన్స్ విచారణతో సర్వత్రా ఉత్కంఠ

సంగారెడ్డి అర్బన్, జూలై 29 : వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఉద్యోగుల బదిలీల్లో భారీ అవినీతి జరిగిందని ప్రచారం జరగడంతో ఆ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రెండు రోజుల క్రితం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. అవినీతి, అవకతవకలకు పాల్పడినవారు ఏ స్థాయి ఉద్యోగైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖలో పలువురు ఉద్యోగులు వివిధ యూనియన్లకు ఆఫీస్ బేరర్లుగా పేర్కొంటూ టీజీవో, టీఎన్‌జీవో, ఐఎన్‌టీయూసీ యూనియన్‌ల నుంచి లేఖలు తెచ్చుకుని బదిలీల నుంచి మినహాయింపు పొందారనే భారీగా ఆరోపణలు వచ్చాయి. దీన్ని సీరియస్‌గా తీసుకున్న సర్కారు విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా పలువురు వివిధ కేడర్ల ఉద్యోగులు ఆఫీస్ బేరర్ల పేరిట లేటర్లు సమర్పించి రాష్ట్ర స్థాయిలో బదిలీల నుంచి వెసులుబాటు పొందారని పలువురు ఆరోపిస్తున్నారు. లాంగ్ స్టాండింగ్ ఉన్నప్పటికీ కొందరు ఆయా యూనియన్ల ఆఫీస్ బేరర్ల పేరిట లేటర్లతో వేరే చోటుకు స్థానచలనం కలగకుండా లబ్ధిపొందారని ఈ వ్యవహారంలో భారీగా అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.









విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గజ్వేల్, జూలై 29: వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన నీల ఎల్లం(53) కొన్నాళ్లుగా ప్రజ్ఞాపూర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నాడు. సోమవారం ట్రాక్టర్ సహాయంతో పొలాన్ని దున్నుతుండగా కరెంట్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్లం కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.







రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయలేదంటే
రాజీవ్‌రహదారిని దిగ్బంధం చేస్తాం

● బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 29: మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నీటితో నింపాలని, లేదంటే రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా ఇప్పటివరకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్ తదితరులున్నారు.





ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకొని యువకుడి ఆత్మహత్య


శివ(ఫైల్)

శివ్వంపేట, జూలై 29 : బోనాల పండుగ రోజు యువకుడు ఆత్మహత్య చేసుకుని తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చిన సంఘటన మండల పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు దొంతి గ్రామానికి చెందిన సోము శివ(25) ఏపని చేయకుండా అల్లరిచిల్లరగా తిరుగుతుంటాడు. తల్లిదండ్రుల మాట వినకుండా చిరాకుపడుతూ విచిత్ర మనస్థత్వంతో ప్రవర్తిస్తాడు. శివ గతేడాది బోనాల పండుగ రోజున ఇంటి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను పట్టుకోవడంతో చేతికి తీవ్రగాయమైంది. వైద్యులు కుడి చేయిని తొలగించారు. కాగా మళ్లీ ఆదివారం రాత్రి బోనాల దగ్గర నుంచి కొడుకు శివను ఇంటికి రమ్మని తండ్రి శ్రీరాములు పిలిచాడు. తాను ఇంటికి రాను అంటూ రెండోసారి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లి వైర్‌ను ముట్టుకోవడంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

బెట్టింగ్‌లకు అలవాటు పడి దొంగతనం

రేగోడు జూలై 29: ఆన్‌లైన్‌లో బెటింగ్‌లకు అలవాటు పడి దొంగతనం చేసి కటకటాల పాలైన సంఘటన రేగోడు మండలంలో చోటుచేసుకుంది. రేగోడు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అల్లాదుర్గం సీఐ రేణుక తెలిపిన వివరాలు వెల్లడించారు. రేగోడు మండలంలోని మక్త వెంకటాపురంలో ఈనెల 22న పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. రూ.2.10 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపరించారు. బాధితుడు సంగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేగోడు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. అదే గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ సిద్దిపేట జిల్లా చేర్యాల గ్రామంలో మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్నాడు. అతనిపై అనుమానంతో పోలీసులు విచారణ చేపట్టగా దొంగతనం బయటపడింది. జ్ఞానేశ్వర్ చోరీ చేసిన నగదును అతని భార్యకు ఇవ్వగా ఈ డబ్బు ఎక్కడిదని నిలదీసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా గెలుచుకున్న అంటూ చెప్పాడు. ఆ డబ్బును రికవరీ చేసి కోర్టులో డిపాజిట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసమే దొంగతనం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ వచ్చామని తెలిపారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

అల్లాదుర్గం, జూలై 29 : ముస్లాపూర్‌లో తల్లి తన ముగ్గురు పిల్లలతో కలసి అదృశ్యమైనట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన చిన్నకటిక యాదుల్మియ భార్య షకీరా(30) తన కూతురు షఫీమహీన్(8), ఆఫ్షీన్(6) ముఫ్రాజూర్(4)తో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు దీంతో భర్త యాదుల్మియ పలు చోట్ల గాలించినప్పటికిని వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అత్తపై కత్తితో అల్లుడి దాడి

చేర్యాల, జూలై 29 : అత్తపై అల్లుడు కత్తితో దాడిచేసిన సంఘటన కొమురవెల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. కొమురవెల్లి గ్రామానికి చెందిన పాతకోటి చంద్రకళ మల్లన్న ఆలయ సమీపంలోని రాతి గీరెలు సమీపంలో బొమ్మలు విక్రయించుకుంటూ జీవిస్తుంది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్దకుమార్తె మౌనిక వివాహం 2010లో లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎల్లారెడ్డితో జరిగింది. కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మౌనిక తల్లివద్దే ఉంటుంది. ఈ విషయమై అల్లుడు ఎల్లారెడ్డి ఆదివారం రాత్రి కొమురవెల్లికి చేరుకుని కత్తితో చంద్రకళపై దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయాలపాలైన ఆమె సోమవారం కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజుగౌడ్ తెలిపారు.





బ్యాంకు నిర్లక్ష్యం.. రైతులకు శాపం

● సీడెడ్ సొసైటీ సభ్యులకు రుణాల రెన్యూవల్ చేయని ఎస్‌బీఐ
● రుణమాఫీకి నోచుకోని సొసైటీ రైతులు

కొండాపూర్/నారాయణఖేడ్, జూలై 29 : బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం సీడెడ్ సహకార సంఘాల్లోని రైతులకు శాపంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీతో రైతులు సంబురాలు జరుపుకుంటుండగా సంగారెడ్డి జిల్లాలోని 16 ప్రాథమిక సహకార సంఘాల రైతుల్లో మాత్రం అయోమయం నెలకొన్నది. ఈ సహకార సంఘాలకు గతంలో ఎస్‌బీహెచ్ బ్యాంకు రుణాలను మంజూరు చేసింది. అయితే, ఈ బ్యాంకు ఎస్‌బీఐలో విలీనం తర్వాత పరిస్థితి తలకిందులైంది. ఎస్‌బీఐ సీడెడ్ సొసైటీలకు రుణాలు ఇచ్చేందుకు నిరాకరించింది. అంతేకాకుండా, పాత రుణాలను సైతం రెన్యూవల్ చేయడంలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ ఈ సొసైటీ సభ్యులకు వర్తించడం లేదు.



కొండాపూర్ పీఏసీఎస్ కార్యాలయం

ఎనిమిది వేలకుపైగా రైతులు

జిల్లావ్యాప్తంగా 53 ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘాలున్నాయి. అందులో సీడెడ్ సొసైటీలు 16 పీఏసీఎస్‌లు కొనసాగుతున్నాయి. వీటిలో 8 వేలకుపైగా రైతులు రుణాలను పొందారు. సంగారెడ్డి డివిజన్ పరిధిలో ఆరు పీఏసీఎస్‌లు సీడెడ్ సొసైటీలుగా కొనసాగుతున్నాయి. అవి మల్కాపూర్, కొండాపూర్, నందికంది, నాగాపూర్, తేర్పోల్, రుద్రారం. వాటి పరిధిలో 3,188 మంది రైతులు రుణాలు పొందారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో మొత్తం 12 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా ఆరు సీడెడ్ సొసైటీలు ఉన్నాయి. అవి సంజీవన్‌రావుపేట, గంగాపూర్, కడ్పల్, మార్డి, బీబీపేట, కల్హేర్. వాటి పరిధిలోని 2,615 మంది రుణాలను పొందారు. గతంలో ఎస్‌బీహెచ్ కొనసాగిన సమయంలో వీరు రుణాలను పొందారు. 2017 మార్చి 31న ఎస్‌బీహెచ్ ఎస్‌బీఐలో బ్యాంకులో విలీనమైంది. అనంతరం ఎస్‌బీహెచ్ సీడెడ్ సొసైటీలకు రుణాల మంజూరులో మొండిచేయి చూపింది. పాత వాటిని చెల్లించి కొత్త రుణాలను పొందాలని రైతులకు నోటీసులు సైతం పంపారు.

డిపాజిట్లు ఉన్నా రెన్యూవల్‌కు నో

రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 మధ్యన రుణాలు పొందిన వారికి రుణమాఫీకి కటాఫ్ తేదీగా నిర్ణయించింది. మొదటి దశలో రూ.లక్ష లోపు రుణాల మాఫీ చేసింది. ప్రస్తుతం రూ.1.50 వేల రుణాల మాఫీకి సిద్ధం అవుతుంది. 2017 నుంచి సీడెడ్ సొసైటీలకు సంబంధించి రుణాలను రెన్యూవల్ చేయకపోవడంతో సీడెడ్ సొసైటీల రైతులకు రుణాలు మాఫీ కావడం లేదు. అలాగే, పాత రుణాలకు వడ్డీ పెరిగి తడిసి మోపెడైంది. వాటిని చెల్లించకపోవడంతో కొత్త రుణాలు సైతం పొందేందుకు వీలు లేకుండాపోయింది. ఇటు రుణ మాఫీ జరగక.. అటు కొత్త రుణాలు పొందే వీలు లేక సీడెడ్ సొసైటీ రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సొసైటీలకు సంబంధించి డబ్బులు బ్యాంకు వారి వద్ద డిపాజిట్‌లు ఉన్నప్పటికీ కూడా రుణాలను రెన్యూవల్ చేయకపోవడంతో తీరని అన్యాయం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు.

మాఫీ కానీ రుణాలు

సంగారెడ్డి డివిజన్ పరిధిలోని ఆరు సీడెడ్ సొసైటీల్లోని 3,188 రైతులకు సంబంధించి రూ.19.21 కోట్ల రుణాలు, నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ఆరు సీడెడ్ సొసైటీల్లోని 2,615 మంది రైతులకు సంబంధించి రూ.11.84 కోట్ల రుణాలు పేరుకుపోయాయి. సంగారెడ్డి డివిజన్ పరిధిలోని మల్కాపూర్ పీఏసీఏ ఎలో 268 మంది రైతులకు రూ.357 కోట్ల రుణాలు ఉన్నాయి. కొండాపూర్ సొసైటీలో 633 మందికి 4.64 కోట్లు, నందికందిలో 181 మందికి రూ.1.45 కోట్లు, నాగాపూర్‌లో 550 మందికి రూ.3.39 కోట్లు, తేర్పోల్‌లో 187 మందికి రూ.1.88 కోట్లు రుద్రారం సొసైటీలోని 1369 మంది రైతులకు రూ.4.25 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉంది. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని మార్డి సొసైటీ పరిధిలో 468 మంది రైతులకు రూ.2.21 కోట్లు, కడ్పల్‌లో 320 మందికి రూ.1.80 కోట్లు, సంజీవన్‌రావుపేటలో 431 మందికి రూ.2.29 కోట్లు, కల్హేర్ పరిధిలో 328 మందికి రూ.1.32 కోట్లు, బీబీపేట సొసైటీ పరిధిలోని 997 మంది రైతులకు రూ.3.34 కోట్ల రుణాలు మాఫీ కాకుండాపోయింది. సహకార బ్యాంకు పరిధిలోని వారికి రుణాలు మాఫీ కాగా, ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్‌లు విలీనం కావడానికి తోడు తమ సహకార సంఘాలను సీడెడ్ సొసైటీలుగా ఉంచడంతోనే రుణమాఫీ వర్తించలేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి తమకు రుణమాఫీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీడెడ్ సంఘంగా ఉండడంతోనే నష్టం



మా సహకార సంఘం సీడెడ్ సహకార సంఘంగా ఉండడంతోనే నష్టం వాటిల్లింది. మా సంఘాన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో విలీనం చేస్తే ఈ సమస్య ఉండేది కాదు. సంఘం పరిధిలోనే 431 మంది రైతులకు నష్టం వాటిల్లింది.

- గునుకుల సంజీవరెడ్డి, సంజీవన్‌రావుపేట సొసైటీ

మాకు రుణమాఫీ వర్తింపజేయాలి



రుణమాఫీ పొందడానికి మాకు అన్ని అర్హతలు ఉన్నాయి. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతోనే మాఫీ కావడం లేదు. ప్రభుత్వం స్పందించి కల్హేర్ పీఏసీఎస్ రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి.

- సంగమేశ్వర్ కులకర్ణి, కల్హేర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్

బ్యాంకుల విలీనంతో సమస్య



ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్‌ల విలీనంతో సీడెడ్ సొసైటీల్లోని రైతులు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. సొసైటీలు ఎస్‌బీహెచ్ పరిధిలో ఉన్నప్పుడు రైతులకు అన్ని రకాల రుణాలు ఇచ్చారు. విలీనం అయ్యాక కొత్త రుణాలు ఇవ్వడం లేదు. పాత రుణాలను రెన్యూవల్ చేయడం లేదు. దీంతో రుణమాఫీ దక్కకుండా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

-మహేష్‌రెడ్డి, సంజీవన్‌రావుపేట సొసైటీ సీఈవో

మాపై వివక్ష చూపొద్దు



గత ప్రభుత్వంలో రుణమాఫీ కాలేదని రెన్యూవల్ చేయలేదు. కటాఫ్ తేదీలు ప్రకటించడంతో మేము దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. 2017కు ముందు లక్షా యాభై వేలు అప్పు తీసుకుంటే ఇప్పుడు మిత్తే రూ.లక్షా 85వేలు మొత్తం 3 లక్షల 35 వేలు అయ్యింది. మాపై వివక్ష చూపకుండా మాఫీ వర్తించేలా చూడాలని కోరుకుంటున్నాను.

- నాగప్ప, గారకుర్తి

సన్న, చిన్నకారు రైతులం కావడంతోనే..



సన్న, చిన్నకారుల రైతులం కాబట్టే సొసైటీల్లో సభ్యులుగా చేరి రుణాలు తీసుకున్నాం. పెద్దరైతులమైతే నేరుగా బ్యాంకుల్లోనే రుణాలు పొందేవాళ్లం. నిజమైన రైతులు అని అధికారులకు, బ్యాంకర్లకు తెలిసినా మాఫీ మాకు వర్తించదా. రుణాలు చెల్లించే శక్తి మాదగ్గర ఉంటే అసలుకు మూడింతల మిత్తిని మోసేభారం ఎందుకేసుకుంటాం. కటాఫ్ తేదీలను సొసైటీ రైతులకు వర్తించకుండా ప్రభుత్వమే రుణమాఫీ చేయాలని కోరుతున్నా.

- ఏ.లక్ష్మణ్, రైతు, మల్కాపూర్

ఓడీఎఫ్ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైర్డ్ కావాలి

● ఏఐఏఎన్‌జీవోస్ ప్రెసిడెంట్ జయవర్ధన్ డిమాండ్

కంది, జూలై 29 : ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న దాదాపు 60 వేల మంది పైచిలుకు సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైర్డ్ కావాలని ఏఐఏఎన్‌జీవోస్ (ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్) ప్రెసిడెంట్ జయవర్ధన్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సోమవారం ఆయన వివిధ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ 2021లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు కార్పొరేటీకరణ అయ్యాయని, అప్పుడు ఉద్యోగుల భవిష్యత్ సేవా షరతులపై సుమారు 70 మంది ఉద్యోగులను డీమ్డ్ డిప్యూటేషన్ ఏర్పాటు కింద ఏడు వేర్వేరు డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్‌లకు రీ అసైన్‌మెంట్ చేసిందన్నారు. ఇది వచ్చే సెప్టెంబరు 30వ తేదీతో ముగిస్తుందన్నారు. గతంలో ప్రసారభారతిలో పనిచేసిన ఉద్యోగులను వారు రిటైర్డ్ అయ్యేదాక ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, తమను కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వెంటనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అలా జరగకుంటే తొలిదశలో ఆగస్టు 1వ తేదీన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని, 6వ తేదీ రక్షణమంత్రికి మెమోరాండం సమర్పించి శాంతియుత నిరసనలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఐఏఎన్‌జీవోస్ ప్రధాన కార్యదర్శి అజయ్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ నర్సింగ్ ఆఫీసర్లకు.. మూడు నెలలుగా వేతనల్లేవు!



సంగారెడ్డి అర్బన్, జూలై 29 : వారంతా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమితులైన వారు కాదు. ఏకంగా ప్రభుత్వం నియమించిన రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్లు. రెగ్యులర్‌గా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు రావాలి. కానీ సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతనంగా నియమితులైన రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ల(స్టాఫ్ నర్సులు)కు మూడు నెలల వేతన బకాయిలు ఏర్పడ్డాయి. ఈ ఆస్పత్రిలో ఫిబ్రవరిలో 142 మంది నర్సింగ్ ఆఫీసర్లు నియమితులయ్యారు. సుమారు ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు రాలేదు. విచిత్రమేమిటంటే జూన్ నెలకు సంబంధించిన వేతనాలు మాత్రం వచ్చాయి. బకాయి పడ్డ మూడు నెలల వేతనాల కోసం నర్సింగ్ ఆఫీసర్లు నిత్యం ఆస్పత్రి కార్యాలయ అధికారుల వద్దకు చక్కర్లు కొడుతూనే ఉన్నారు. కానీ వారి నుంచి నేడు, రేపు వస్తాయనే సమాధానం మాత్రమే వినిపిస్తున్నదని నర్సింగ్ ఆఫీసర్లు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బోధనాస్పత్రులతో పాటు టీవీవీపీ పరిధిలో కొత్తగా నియమితులైన అందరు నర్సింగ్ ఆఫీసర్లకు ఆ మూడు నెలల వేతనాలు వచ్చేశాయని, కానీ సంగారెడ్డి జీజీహెచ్ నర్సింగ్ ఆఫీసర్లకు రాకపోవడం గమనార్హం. ఆస్పత్రి కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం వల్లే మూడు నెలల వేతనాలు ఇప్పటి వరకు రాలేదని పలువురు నర్సింగ్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించేలా చొరవ తీసుకోవాలని ఉన్నతాధికారులను నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా.. 3.80 కోట్ల మందికి ఉచిత ప్రయాణం

● ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులత

సంగారెడ్డి అర్బన్, జూలై 29 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మెదక్ రీజియన్‌లో ఇప్పటివరకు 3.80 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబరు 9 నుంచి నేటి వరకు ప్రతీ రోజు సుమారు లక్షా 70 వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఈ పథకం ప్రవేశపెట్టకముందు 70 శాతం ఓఆర్ ఉన్న ఆక్యుపెన్సీ రేషియో నేడు 98 శాతంగా ఉన్నదన్నారు. గతంలో రోజూ సుమారు 1.80 లక్షల మంది ప్రయాణిస్తుండగా, ప్రస్తుతం దాదాపు 2.60 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. మెదక్ రీజియన్‌కు నేటి వరకు 10 డీలక్స్, 35 పల్లె వెలుగు, 42 ఎక్స్‌ప్రెస్ బస్సులు, మొత్తంగా 87 కొత్త బస్సులు వచ్చాయని తెలిపారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్‌ను సిద్దిపేట, మెదక్, జహీరాబాద్ డిపోలలో ప్రారంభించామన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వం నూతన డ్రైవర్లు, శ్రామిక్, సూపర్‌వైజర్లు తదితర విభాగాల్లో 3,035 నియామకాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

'గాయత్రి' యాజమాన్యంపై ముఖ్యమంత్రికి జుక్కల్ ఎమ్మెల్యే ఫిర్యాదు


● రైతుల పేరిట రూ.9 కోట్ల రుణాలు తీసుకున్న కర్మాగారంపై విచారణ జరపాలి


మాగి సమీపంలోని గాయత్రి చక్కెర కర్మాగారం

నారాయణఖేడ్, జూలై 29: రైతుల సంబంధం లేకుండా వారి పేరిట రుణాలు పొందిన గాయత్రి చక్కెర కర్మాగారం యాజమాన్యంపై విచారణ చేపట్టాలని కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి శివార్‌లో ఉన్న గాయత్రి చక్కెర కర్మాగారం యాజమాన్యం రైతులకు పేరిట రూ.9 కోట్ల రుణాలను మోసపూరితంగా పొందిందన్నారు. నిజామాబాద్ పట్టణంలోని నాందేవ్‌వాడలోని యూనియన్ బ్యాంకుశాఖ నుంచి ఈ రుణాలను సేకరించిందన్నారు. కర్మాగారం ప్రారంభమయ్యాక చెరకు రైతుల నుంచి అగ్రిమెంట్‌పేరిట, బ్యాంకురుణపత్రాలపై మోసం చేసి సంతకాలు తీసుకుందని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్నిమాఫీ చేసినట్లు రైతులకు ఎస్‌ఎంఎస్‌లు వెళ్లడంతో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. పత్రికల్లో వార్తలు రావడంతో కర్మాగారం యాజమాన్యం హడావిడిగా ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిన కుంటిసాకులు చెబుతూ తప్పించుకునే యత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విషయమై కర్మాగారం యాజమాన్యంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. 'ఆంధ్రజ్యోతి'లో రుణమాఫీ ఫ్యాక్టరీ పాలు అని ఈనెల 24న వార్త కథనం ప్రచురితం కావడంతో, కలెక్టర్ ఈ విషయమై నారాయణఖేడ్ పరిధిలో విచారణ జరపాలని ఆదేశించారు. మనూరు మండలం తోర్నల్‌లో జిల్లా వ్యవసాయ అధికారిణి మూడు రోజుల క్రితం విచారణ చేపట్టారు.

బాగున్నావా 'జోగీ'

● ఏఎంసీ మాజీ చైర్మన్‌కు చంద్రబాబు పలకరింపు


ఏపీ సీఎం చంద్రబాబునాయుడితో గంగా జోగినాథ్‌గుప్తా

జోగిపేట, జూలై 29 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సంగారెడ్డి-జోగిపేట-మెదక్ రైల్వే లైన్ సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్‌గుప్తా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీకి వెళ్లిన గంగా జోగినాథ్ ఆయన ఉంటున్న బంగళా వద్ద నిల్చున్నారు. అప్పుడే బయటకు వచ్చిన చంద్రబాబు 'జోగీ' బాగున్నావా అంటూ ఆప్యాయంగా పలకరించడం విశేషం. తన బంగళాలోకి సెక్యూరిటీతో జోగినాథ్‌ను పలిపించుకున్నారు. ఈ సందర్భంగా జోగినాథ్ చంద్రబాబునాయుడిని సన్మానించారు. తనతో సుమారు 10 నిమిషాల పాటు మాట్లాడి, తన కుటుంబ యోగక్షేమాలు కనుక్కున్నారని గంగాజోగినాథ్ తెలిపారు.

వైభవంగా బోనాలు



పుల్కల్ మండలం చక్రియాల్‌లో బోనాల ఊరేగింపు, తూప్రాన్ పట్టణంలో శోభాయాత్ర

తూప్రాన్/నర్సాపూర్/శివ్వంపేట/జోగిపేట/పుల్‌కల్, జూలై 29 : మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలుచోట్ల బోనాల పండుగ వైభవంగా కొనసాగింది. తూప్రాన్ పట్టణంలోని ఉజ్జయిని మహంకాళి జాతర రెండోరోజైన సోమవారం లింగగావు, కుంభగావు, భవిష్యవాణి నిర్వహించారు. రాత్రి వివిధ సంఘాల ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు చేపట్టారు. నర్సాపూర్ పట్టణంలో గ్రామదేవతల బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నల్లపోచమ్మ, భూలక్ష్మీఅమ్మవారు, దుర్గామాత ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజులు, శివసత్తుల నృత్యాలతో పాటు ప్రత్యేకంగా అలంకరించిన పలహారం బండ్లు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, తదితరులు పాల్గొన్నారు. శివ్వంపేట మండలంలోని గోమారం గ్రామంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలహారం బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. జోగిపేటలోని బృందావన్ కాలనీ మహిళలు సోమవారం భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించారు. అనంతరం కాలనీవాసులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ పాండు, కాలనీ అధ్యక్షుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అల్లె శ్రీకాంత్, కౌన్సిలర్ నాగరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు. పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో స్థానిక గ్రామ దేవతల విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొన్నది.



శివ్వంపేట మండలం గోమారంలో పలహారం బండి ఊరేగింపులో ఎమ్మెల్యే సునీతారెడ్డి, జోగిపేటలో బోనాలతో మహిళలు

పోలీస్ గ్రీవెన్స్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 29: పోలీసు గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.


కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ

కొల్చారం, హవేళిఘణపూర్ పీఎస్‌ల సందర్శన

కొల్చారం/హవేళిఘణపూర్, జూలై 29 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి సూచించారు. కొల్చారం, హవేళిఘనపూర్ మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్‌లను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్‌రేట్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసుల సేవల్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా శాంతిభద్రతలు పరిరక్షించాలని పోలీసులకు సూచించారు. పోలీసు సిబ్బంది తరుచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు భద్రత భావాన్ని పెంపొందించాలన్నారు. డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించాలన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలకు నమ్మకం కలగాలంటే విజుబుల్ పోలీసింగ్‌తోనే సాధ్యపడుతుందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారు చెప్పే సమస్యలను విని పరిష్కరించాలన్నారు. నేరాల దర్యాప్తుల్లో సాంకేతికతను వినయోగించుకుని, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్‌పై నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, కొల్చారం ఎస్ఐ మహ్మద్‌గౌస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

హైవే పొడవునా ఆక్రమణలపై కొరడా

● రోడ్డుకిరువైపులా దుకాణాలు, మొబైల్ టిఫిన్ సెంటర్ల తొలగింపు
● రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం

తూప్రాన్, జూలై 29: కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు విస్తరించి ఉన్న 44(7వ) జాతీయ రహదారి విస్తరణ చర్యలు చేపట్టిన జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) రోడ్డు ఆక్రమణ వ్యాపారాలపై కొరడా ఝులిపిస్తుంది. హైవే రోడ్డు పరిధిలో ఏర్పాటు చేసిన మొబైల్ టిఫిన్ సెంటర్లు, టీ కొట్టు, ఇతరత్రా వ్యాపారాల తొలగింపు చర్యలు చేపట్టింది. అందుకు ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా చెబుతున్నారు. రోడ్డు పక్క వ్యాపారాలతో ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోతుండగా, హైవే బౌండ్రీలో ఎలాంటి ఆస్కారం లేకుండా చేస్తున్నారు. ముమ్ముందు హైవే బౌండ్రీలో వాహనాలు నిలిపితే ఛార్జీలను కూడా వసూలు చేయబోతున్నారు.

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి కామారెడ్డి (పాత నిజామాబాద్ జిల్లా) అడ్లూర్ ఎల్లారెడ్డి వరకు 113 కిలోమీటర్ల పొడవు 44 (పాత ఎన్‌హెచ్ 7)వ జాతీయ రహదారిని 2006లో నాలుగు లేన్ల రహదారిగా విస్తరణ పనులు చేపట్టి 2009లో పూర్తి చేశారు. ఈ రోడ్డు పక్కన చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. మొబైల్ టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు, ఇతరత్రా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కటిగా హైవే పొడవునా చిరు వ్యాపారాలు పెరిగిపోయాయి. హైవే పక్కన (బౌండ్రీలో) ఏర్పాటు చేసిన వ్యాపారాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వాహనం దూసుకుపోవడంతో విలువైన ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఎన్‌హెచ్‌ఏఐ సీరియస్‌గా తీసుకున్నది. దీంతో హైవే పక్కన ఏర్పాటు చేసిన వ్యాపారాలను తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. జీఎంఆర్ సంస్థ నిర్వహణలో ఉన్న కామారెడ్డి జిల్లా అడ్లూర్ ఎల్లారెడ్డి నుంచి మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వరకు 113 కిలోమీటర్ల పొడవునా ఆక్రమణలు తొలగిస్తున్నారు. హైవే పక్కన ఎలాంటి వ్యాపారాలు చేయరాదంటూ సూచిస్తున్నారు. అలాగే హైవే పక్కన వెలసిన దాబా, హోటళ్లకు సైతం నోటీసులు జారీ చేశారు. దాబా, హోటళ్ల ముందు వాహనాల పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని నోటీసులు వివరించారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి బోయిన్‌పల్లి వరకు 27కిలోమీటర్ల పొడవు 44వ జాతీయ రహదారిని ఆరులేన్ల రోడ్డుగా విస్తరిస్తున్నారు. ఈ పనులు చేపట్టే ప్రదేశంలో ముందస్తుగా హైవే పరిధిలో ఎలాంటి వ్యాపారాలు కొనసాగించకుండా చర్యలు తీసుకుంటున్నారు. హైవే మీదకు రాకుండా ఏర్పాట్లు చేస్తు, సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు.



హైవే రోడ్డు పరిధిలో ఏర్పాటు చేసిన వ్యాపారాల తొలగింపు, వ్యాపారాలకు అడ్డుగా ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కందం

హైవే రోడ్డుపై నిలిపితే జరిమానాలు..!

హైవే రోడ్డు పొడవునా, పక్కన వాహనాల పార్కింగ్ చేస్తే భారీగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. టోల్‌రుసుం చెల్లింపులు చేసినట్లుగా ఫాస్టాగ్ సహాయంతో వసూలు చేయబోతున్నారు. ఈ విషయంలో ఎన్‌హెచ్‌ఏఐ సీరియస్‌గా తీసుకోబోతుంది. శాటిలైట్ ఆధారంగా జీపీఆర్‌ఎస్‌తో ఛార్జీలు వసూలు చేయబోతున్నట్లు తెలిసింది.

నేడు రెండోవిడత 'రుణమాఫీ' విడుదల

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి అర్బన్, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ రెండో విడత నిధులను ప్రభుత్వం జూలై 30న ఉదయం 12 గంటలకు సీఎం అసెంబ్లీ ప్రాంగణం నుంచి విడుదల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. మంగళవారం ఉదయం 12 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రైతులు అధికారుల సమక్షంలో రెండో విడత రుణ మాఫీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రుణమాఫీ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది సహకార శాఖ సిబ్బంది బ్యాంక్ సిబ్బంది పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో రుణమాఫీ లబ్ధిదారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

జాతీయ వినియోగదారుల కమిషన్

సంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్‌గా అరుణ చక్రవర్తుల



పటాన్‌చెరు, జూలై 29: జాతీయ వినియోగదారుల కమిషన్ సంగారెడ్డి జిల్లా కమిటీ చైర్‌పర్సన్‌గా బీరంగూడకు చెందిన అరుణ చక్రవర్తులను నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వినియోగదారుల హక్కుల కమిషన్ జాతీయ కార్యవర్గసమావేశంలో అరుణచక్రవర్తులకు సంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్‌గా నియమిస్తూ జాతీయ చైర్మన్ ఎంవీఎల్ నాగేశ్వరావు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో వినియోగదారుల హక్కులపై చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర చైర్మన్ నల్లమాస శ్రీకాంత్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గ్రామాల్లో కనిపించని 'ప్రత్యేక పాలన'

● ఝరాసంగం మండలంలో అధ్వానంగా అంతర్గత రోడ్లు ● పడకేసిన పారిశుధ్యం ● బోరు మోటార్లు కాలిపోతే పట్టించుకునేవారే కరువు





బర్దిపూర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు, ఝరాసంగంలో యథేచ్ఛగా పందుల సంచారం, గుంతమర్పల్లిలో తాగునీటి బోరు చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

ఝరాసంగం, జూలై 29: ప్రత్యేక అధికారులు వారి శాఖలకే పరిమితం కావడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి. ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ వారు గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి పోవడంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదు. ఏదో సందర్భంలో గ్రామాల్లో సమస్యల ప్రస్తావన రాగానే పంచాయతీల్లో నిధులు లేవని అధికారులు చేతులెత్తేస్తున్నారు. గత వారం రోజుల నుంచి ముసురు వీడకపోగా, మురుగు కాల్వల్లో చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా గ్రామాల్లోని అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై నడవాలన్నా జంకే పరిస్థితి నెలకొన్నది.


తూతూ మంత్రంగా 'డ్రైడే - ఫ్రైడే'

ప్రతీ శుక్రవారం గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు మురుగు కాల్వల శుభ్రత, నివాసాల పరిసరాల్లో నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించి బ్లీచింగ్ పౌడర్ వంటి వాటిని చల్లాలని కలెక్టర్ ఆదేశించినా ఆచరణలో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. గత వారం రోజుల నుంచి వీడని ముసురు వర్షం కారణంగా గ్రామాల్లో మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. గ్రామాల్లో పందులు సైతం విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.

వ్యాధులు ప్రబలితే గాని స్పందించరా?

వర్ష కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఆశావర్కర్లు గ్రామాలకు వెళ్లి ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి వారం రోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేసి ఆదేశించారు. కానీ గ్రామాల్లో ఆ ఊసే లేదు. నేటికీ అపరిశుభ్రతే దర్శనమిస్తున్నది. వ్యాధులు వస్తే తప్ప అధికారులు స్పందించరా అని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలి



వర్షాల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యం పనులను ప్రత్యేకాధికారులు నిత్యం పర్యవేక్షిస్తేనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు. ముఖ్యంగా గ్రామస్థులకు పరిసరాల పరిరక్షణపై తరచూ అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారం రోజుల నుంచి వర్షాలు కురవడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి.

\- బాశెట్టి, బోరెగావ్

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనఖీ చేస్తున్న పోలీసులు

జహీరాబాద్, జూలై 29: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణం లోని బీదర్‌చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం పట్టణ ఎస్ఐ కాశీనాథ్ నేతృత్వంలో వాహనాల తనఖీ చేపట్టారు. ఇందులో భాగంగా డాగ్ స్క్వాడ్ క్లూస్ టీంతో వాహనాలను తనఖీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ కాశీనాథ్ మాట్లాడుతూ నేరాలను అదుపు చేసే దిశగా వాహనాలను తనఖీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

కంగ్టిలో 8 ద్విచక్ర వాహనాలు సీజ్

కంగ్టి, జూలై 29: సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు కంగ్టి ఎస్ఐవిజయ్‌కుమార్ తెలిపారు. కంగ్టిలో సోమవారం వాహనాలను తనిఖీ చేయగా పత్రాలు లేకుండా నడుపుతున్న బైకులు పట్టుబడ్డాయని, వాటిని సీజ్ చేశామని సీఐ వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నారాయణ, హెడ్ కానిస్టేబుల్ బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపిన ఘటనలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు

శివ్వంపేట, జూలై 29: బోనాల పండుగ రోజున ఫ్లెక్సీని చింపిన ఇద్దరు బీఆర్‌ఎస్ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సోమవారం శివ్వంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేటలో బోనాల పండుగ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా ఫ్లెక్సీని బీఆర్‌ఎస్ నాయకులు చింపివేశారని కాంగ్రెస్ నాయకుడు వారల గణేష్ ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు భార్గవ్, అజయ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనను కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ సంజీవరావు

జహీరాబాద్, జూలై 29: జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు సత్ప్రవర్తనను కలిగి ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలనే వృత్తిగా ఎంచుకున్నవారు వాటిని వదులుకుని సక్రమమైన మార్గం లో నడుచుకోవాలన్నారు. నేరం చేసిన వారికి ఎప్పటికైనా శిక్షతప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ. శివలింగం పోలీసులు పాల్గొన్నారు.

ఖేడ్ డివిజన్‌లో జాతీయ రహదారి విస్తరణకు శ్రీకారం

నారాయణఖేడ్, జూలై 29: నిజాంపేట- ఖేడ్- బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణ పనులు సోమవారం ఖేడ్ డివిజన్ పరిధిలో ప్రారంభమయ్యాయి. ఖేడ్ పట్టణ సమీపంలోని ఖేడ్ నుంచి మనూరు వెళ్లే మార్గంలో బాణాపూర్ శివారు నుంచి రోడ్డు పక్కన విస్తరణ కోసం ఇచ్చిన మార్కింగ్ మేరకు రోడ్డుకు ఓ పక్కన జేసీబీతో తవ్వకం పనులను చేపట్టారు. బాణాపూర్, జగన్నాథ్‌పూర్ శివార్లలో తవ్వకాలు పూర్తి కాగా, పిప్రి శివారులో తవ్వకాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఖేడ్ మండలం నర్సాపూర్ సమీపంలో విస్తరణకు అడ్డుగా రోడ్డు పక్క ఉన్న చెట్లను తొలగించారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలోనూ పనులు కొనసాగుతున్నాయి.

బీఆర్‌ఎస్ కార్యకర్తలను కాపాడుకుంటాం: ఎమ్మెల్సీ

హవేళిఘణపూర్, జూలై 29: తమ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని భూర్గుపల్లిలో పార్టీ కార్యకర్త వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో కాలు పూర్తిగా పోగా ఆయనకు ఎమ్మెల్సీ రూ.2లక్షల విలువైన చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితునికి కృత్రిమ కాలు చికిత్స కోసం కూడా తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఆయన వెంట మాజీ ఎంపిపి శేరి నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యామిరెడ్డి, మేకల సాయిలు, మహిపాల్ రెడ్డి, సాయాగౌడ్, శ్రీను నాయక్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, మంగ్యా నాయక్, రాజు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం

హత్నూర, జూలై 29: ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ పేర్కొన్నారు. సోమవారం హత్నూర, నవాబుపేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బుచ్చేంద్ర మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వీరయ్య, రాజు, గంగయ్య ప్రసాద్ పాల్గొన్నారు.

● మాసాయిపేట, జూలై 29: పార్లమెంటు సమావేశాల్లోనే ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధం చేస్తూ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుడ్డి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వంగపల్లి శ్రీనివాస్ ఆగస్టు 6వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

నేడు సామాజిక తనిఖీ

కొల్చారం, జూలై 29: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈనెల 30న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కొల్చారం ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీవో మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈ నెల 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక బృందాల ద్వారా సామాజిక తనిఖీ ఆయా గ్రామాల్లో నిర్వహించినట్లు తెలిపారు. తుది నివేదిక సమర్పించడానికి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి: తపస్

మెదక్ అర్బన్, జూలై 29: విద్యార్థిపై క్రమశిక్షణ చర్య తీసుకున్న ఖమ్మం జిల్లా పేరువంచ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ శిరీషపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గుల్షన్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంత చెప్పినా వినని విద్యార్థులను మార్చే ప్రయత్నం చేసిన ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు వేయడం భావ్యం కాదన్నారు. ఆ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే సస్పెండ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తపస్ నాయకులు మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వినోద్, నరేందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

'విద్య'కు 20 శాతం నిధులు కేటాయించాలి



అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతున్న విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 29 : విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ విద్యా రంగంలో 35 వ స్థానానికి దిగజారిందన్నారు. రూ. 2,91,159 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు కేవలం రూ.21,292 కోట్ల నిధులు కేటాయించడం అత్యంత దారుణమన్నారు. విద్యాభివృద్ధికి 20 శాతం నిధులు కేటాయించే వరకు విద్యాపరిరక్షణ కమిటీ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మయ్యయాదవ్, సంజీవయ్య, సోమశేఖర్, భాస్కర్, ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్, విజయభాస్కర్, కార్యదర్శి అశోక్‌కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్నఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సమీకృత మార్కెట్ దుకాణ సముదాయానికి నిధులు కేటాయించాలి

● మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే గూడెం విజ్ఞప్తి

పటాన్‌చెరు, జూలై 29: పటాన్‌చెరు సమీకృత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మిస్తున్న దుకాణ సముదాయానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మలనాగేశ్వరావును కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మంత్రిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో రూ. 20.40కోట్ల నిధులతో 168 దుకాణాలను నిర్మించేందుకు గతంలో శంకుస్థాపన చేసినప్పటికీ నిధుల మంజూరులో జాప్యంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని మంత్రికి వివరించారు. మంత్రి తుమ్మలనాగేశ్వరావు ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు.

కొడకంచిలో ఆలయానికి జిల్లా కోర్టు న్యాయాధికారి

జిన్నారం, జూలై 29: మండలంలోని కొడకంచి ఆదినారాయణస్వామి ఆలయాన్ని జిల్లా కోర్టు న్యాయమూర్తి భవానీచంద్ర సందర్శించారు. సోమవారం ఆదినారాయణస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించిన న్యాయమూర్తి భవానీచంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామాజీరావు, మాజీ సర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదినారాయణస్వామి ఆలయంలో జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర

మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత



మహిళలకు మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, 17వ వార్డు కౌన్సిలర్

జోగిపేట, జూలై 29:మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని, మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, కమిషనర్ తిరుపతి పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా వారు కౌన్సిలర్ చిట్టిబాబుతో కలిసి సోమవారం 17వ వార్డు పరిధిలోని మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ చెట్ల పెంపకం వల్ల ప్రాణవాయువు పెరిగి, సమస్త మానవాళికి మేలు జరుగుతుందన్నారు. చెట్ల ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం మొక్కల పెంపకానికి విశేష ప్రాధాన్యతనిస్తోందన్నారు. అందుకోసమే, వనమహోత్సవాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మొక్కలను నాటడమేగాకుండా. నాటిన ప్రతీ మొక్క బతికేలా సంరక్షించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, వార్డు నాయకులు జలగరి యాదగిరి, దేవేందర్, మహేశ్, ఆరిఫ్, అడ్డు, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసమాజం ఆధ్వర్యంలో దంపతులకు సన్మానం



డా.శేషు దంపతులను సన్మానిస్తున్న సమాజం నాయకులు, సభ్యులు

జహీరాబాద్, జూలై 29: బ్రహ్మణ సేవాసమాజం సంస్థ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని సమాజ్ అధ్యక్షుడు సురేష్ జోషి, రాజ్‌కుమార్ దేశ్‌పాండే పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో బ్రహ్మణసేవా సమాజం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవాకార్యక్రమాల్లో పాల్గొన్న డా.శేషు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద బ్రాహ్మణులతో పాటు సమాజం కోసం తాము చేపడుతున్న సేవాకార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలచందర్, సరిత, శేషరావు, కవిత, మురళీ, శ్రీహరి, తదితదరులు పాల్గొన్నారు.

రవాణా సేవల కోసం స్థలపరిశీలన



రైతుబజార్ ఆవరణలో ఆర్టీఏ క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ తదితరులు

నారాయణఖేడ్, జూలై 28: ఖేడ్‌లో వారంలో రెండు రోజులు రవాణా శాఖకు సంబంధించిన సేవలు అందించేందుకు నిరుపయోగంగా ఉన్న రైతుబజార్‌ను వినియోగించుకునేందుకుగాను సోమవారం జహీరాబాద్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటయ్య స్థానిక మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌లతో కలిసి పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే సంజీవరెడ్డి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి నారాయణఖేడ్‌లో ఎంవీఐ సేవలు అందించాలని కోరినసంగతి తెలిసిందే. దీంతో మంత్రి వారానికి రెండు రోజులునారాయణఖేడ్‌లోఆర్టీఏ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రైతు బజార్‌కు సంబంధించిన కార్యాలయ భవనంతో పాటు చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయిస్తామని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంవీఐకి తెలిపారు.

'వసతుల కల్పనలో పాలకులు విఫలం'

జహీరాబాద్, జూలై 29: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని రహ్మత్‌నగర్‌లో బస్తీబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు రహ్మత్‌నగర్‌లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఇక్కడ అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మురుగు కాలువలు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రహ్మత్‌నగర్‌లో అంగన్‌వాడీ సెంటర్, రేషన్ దుకాణం అత్యవసరమని, అందువల్ల పాలకులు, అధికారులు స్పందించి ఏర్పాటు చేయాల న్నారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రహ్మత్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తాము పలుమార్లు అధికారులు, నాయకులతో మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని సీఐటీయూ నాయకుల వద్ద స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డలు క్షేమం



శిశువుతో 108 సిబ్బంది

చేగుంట, జూలై 29: నార్సింగి మండలం జప్తి శివనూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు సిబ్బంది తెలిపారు. జప్తిశివనూర్‌కు చెందిన పృథ్వీరాజ్ భార్య రజనికి సోమవారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దాంతో సిబ్బంది స్పందించి వెంటనే ప్రసవం చేశారు. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నారని, వారిని రామాయంపేట ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

రైతుల దీక్షకు సీపీఎం జిల్లా కార్యదర్శి మద్దతు



రైతులకు మద్దతుగా దీక్షలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

నర్సాపూర్, జూలై 29: సంగారెడ్డి కెనాల్‌కు వ్యతిరేకంగా రైతులు నిర్వహిస్తున్న రిలే దీక్ష సోమవారం 18వ రోజుకు చేరుకున్నది. దీక్షకు మద్దతుగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం శిబిరంలో కూర్చొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎ.మల్లేశం మాట్లాడుతూ గత 18రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఎం వారికి అండగా ఉంటుందన్నారు. దీక్షలో రైతులతో పాటు రైతురక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్, లోక్‌సత్తా నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెద్దమ్మకాలనీలో సీసీ రోడ్లు వేయరా?



9వ వార్డులో చిన్న వర్షానికే చిత్తడి

నర్సాపూర్, జూలై 29: పట్టణంలోని 9వ వార్డులో పెద్దమ్మకాలనీలో సీసీ రోడ్డు లేక చిన్న వర్షానికే చిత్తడిగా మారి నడవలేని దుస్థితి నెలకొన్నది. కొత్తగా ఏర్పడిన కాలనీలో కొత్తగా నిర్మించిన ఇళ్ల మధ్యన సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షం వచ్చినపుడల్లా చిత్తడిగా మారడమే కాకుండా నీరు నిల్వగా ఉండి ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో సీసీ రోడ్లు నిర్మించి తమ ఇబ్బందులను తొలగించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ సామగ్రి పంపిణీ

నారాయణఖేడ్, జూలై 29: వర్షాకాలంలో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులకు గురి కాకుండా విధులు నిర్వహించడం కోసం రెయిన్‌కోట్, సేఫ్టీ జాకెట్లు, గ్లౌజులు, బూట్లు తదితర వస్తు సామగ్రిని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి'

నారాయణఖేడ్, జూలై29: ఖేడ్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా, డివిజన్ నాయకులు అశోక్, లింగం, అబ్రహం, నర్సింహులు, ఇసాక్ డిమాండ్ చేశారు. సోమవారం వారు వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరినందున నూతనభవనాన్ని నిర్మించాలన్నారు. బోరుకు మోటార్‌ను ఏర్పాటు చేసి నీటి సమస్యను తీర్చాలన్నారు. శానిటేషన్ కోసం పని మనిషిని కేటాయించాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి: బీజేపీ

నాగల్‌గిద్ద, జూలై 29: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు కష్టపడి పని చేసి సత్తా చాటాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ముక్టాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజురాథోడ్, మాజీవైస్ ఎంపీపీ పండరియాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, బీజేవైఎం అధ్యక్షుడు రమేష్‌యాదవ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో గోతుల పూడ్చివేత

నారాయణఖేడ్, జూలై 29: ఖేడ్‌పట్టణంలోని 161బీ జాతీయ రహదారిపై ఇటీవలి వర్షాలకు చాలా చోట్ల గోతులు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో గుంతల పూడ్చివేత కార్యక్రమాన్ని సోమవారం ముమ్మరంగా చేపట్టారు. బసవేశ్వర చౌక్ నుంచి శివాజీచౌక్ వరకు కంకర, ఇసుక సిమెంట్‌తో కూడిన వెట్‌మిక్స్‌తో గోతులను పూడుస్తున్నారు.

'నామినేటెడ్' దక్కేనా?

నర్సాపూర్ నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి పదవుల కోసం ఆశావహుల ఎదురుచూపులు



నర్సాపూర్, జూలై 29: నామినేటెడ్ పదవులు రెండో దఫా త్వరలో నియమించనున్నారని ప్రచారం జరుగుతుండటంతో ఈసారైన నర్సాపూర్ నియోజకవర్గంలో రాష్ట్రస్థాయిలో పదవులు ఆశిస్తున్న ముఖ్య నాయకుల ఆశలు ఫలిస్తాయా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. మొదటి దఫా 35 రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో మెదక్ జిల్లా నుంచి ఎవరికీ దక్కలేదు. రెండో దఫా నియమించనున్న నామినేటెడ్ పదవుల్లో మెదక్ జిల్లాకు అవకాశం ఉంటుంది అందులో నర్సాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులకు కూడా అవకాశం దక్కుతుందన్న ఆశతో ఉన్నారు.

ఆశలపల్లకిలో..

రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు సుహాసినీరెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పార్లమెంటు ఎన్నికల ముందు వరకు బీఆర్‌ఎస్‌లో ఉండటమే కాకుండా ఆ పార్టీ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నారు. మూడోసారి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోగా ఎంపీ టికెట్ ఇస్తామని ఇవ్వకపోవడంతో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆ సమయంలో అధికారంలోకి వచ్చాక ఆయన స్థాయికి తగ్గట్టు గుర్తిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు నర్సాపూర్ నియోజకవర్గానికి ఇచ్చే క్రమంలో మొదటగా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేరు వినిపిస్తుంది. ఆయనతో పాటు ఆయన అనుచర గణం కూడా ఏదో ఒక రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతోనే ఉన్నారు.

● ఇక డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఆంజనేయులుగౌడ్ విద్యార్థి దశ నుంచి పార్టీని నమ్ముకుని ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీ కోసం పని చేస్తూ ఎన్నో కష్టనష్టాలకోర్చి నేడు డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ కోసమే బతుకుతున్న తనకు కూడా కచ్చితంగా రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి వస్తుందన్న ధీమాలో ఉన్నారు.

● రాష్ట్ర మహిళా నాయకురాలిగా ఉన్న సుహాసినిరెడ్డి కూడా గత ఎమ్మెల్యే ఎన్నికల వరకు బీఆర్‌ఎస్‌లో ఉండగా ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరి పార్టీ అభ్యర్థి గెలుపుకోసం తీవ్రంగా కృషి చేశారు. ఆమె కూడా రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు.

● మరో నాయకుడు రవీందర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తూ పార్టీ కష్టనష్టాల్లో కార్యకర్తలకు అండగా నిలిచారు. ఆయన కూడా అధిష్ఠానం గుర్తించి తనకు రాష్ట్రస్థాయిలో పదవి ఇస్తుందన్న ఆశతో ఉన్నారు.

● నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆవులరాజిరెడ్డికి సైతం నామినేటెడ్ పదవి ఇస్తే బాగుంటుందన్న ఆశలో అయన అనుచర వర్గం ఉన్నా నియోజకవర్గ ఇన్‌చార్జిలకు నామినేటెడ్ పదవులు ఇవ్వరనే ఓ ప్రచారం ఉండటంతో ఆయన నియోజకవర్గంలో పార్టీకి కీలక నేతగా ఇన్‌చార్జిగానే కొనసాగే అవకాశముంది. అయినా అధికారికంగా ప్రొటోకాల్ కోసం పదవి ఇచ్చే అవకాశాలు కూడా లేకపోలేదన్న ప్రచారం జరుగుతుంది.

ఏదిఏమైనా నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయిలో నామినెటెడ్ పదవుల కోసం ఆశతో ఎదురు చూస్తున్న వారి ఆశ ఈసారైనా నెరవేరుతుందో.. లేదోననే అంశం ఆసక్తికరంగా మారింది.